
సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ‘తొలిమెట్టు’ను సమర్థవంతంగా అమలు చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**


సమావేశానికి హాజరైన నోడల్ అధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఎంఈవోలు

హనుమకొండ, డిసెంబర్ 6 : జిల్లాలో తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి అబ్దుల్ హై అధ్యక్షతన తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాల లక్ష్యం, అమలుపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు రూపొందించిన ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాల అమలు పర్యవేక్షణను ఎలా నిర్వహించాలి అనే అంశంపై సీపీడీ సెల్ వరంగల్ డైట్ ఎస్ఆర్జీ గ్రూప్ వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లాను ముందంజలో ఉంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెంపొందించాలని ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని డీఈవో సూచించారు. క్వాలిటీ కో ఆర్డినేటర్ ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుపై మక్కువ పెరిగేలా పాఠాలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో డైట్ వరంగల్ సీపీడీ సెల్ ఎస్ఆర్జీలు మధుసూదన్‌రెడ్డి, కే సంపత్ కుమార్, వీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

**మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

హనుమకొండ, డిసెంబర్ 6 : అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. సాధారణంగా అంబేద్కర్ పేరును వీధికి ఏర్పాటు చేసుకుంటారని, కానీ కేసీఆర్ మాత్రం సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడంతో పాటు 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

### గొప్ప గులాబీ సైనికుడిని కోల్పోయాం

హనుమకొండ : గొప్ప గులాబీ సైనికుడిని కోల్పోయామని దాస్యం అన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసిన గొప్ప నాయకుడు పాగాల సంపత్‌రెడ్డి అని అన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా నిర్వహించిన నాయకుడని అన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ కుటుంబసభ్యులు, తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జనార్దన్ గౌడ్ పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్


సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తదితరులు



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

## అంబేద్కర్ కృషి భావితరాలకు స్ఫూర్తి


**నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి**

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 6 : దేశ నిర్మాణానికి అంబేద్కర్ చేసిన కృషి భావి తరాలకు స్ఫూర్తి అని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి నిట్ డైరెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ భారత ప్రజాస్వామ్యానికి పునాది వేసిన దార్శనికుడు అని అన్నారు.

# ప్రజానేత పాగాల సంపత్‌రెడ్డి


- జడ్పీ చైర్మన్‌గా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి సేవలు
- సంపత్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం
- స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి,
- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సంతాప సభలో పాగాలకు ఘన నివాళులు

జనగామ, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ‘ఉద్యమ వీరుడా.. అలుపెరుగని యోధుడా.. జోహార్ సంపతన్న.. జోహార్ జోహార్.. నీకివే మా కన్నీటి వీడ్కోలు’ అంటూ జనగామ జడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డికి గులాబీశ్రేణులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. గుండెపోటుతో హఠాన్మరణం పొందిన పాగాల సంతాప సభ బుధవారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. జడ్పీచైర్మన్‌గా, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి సేవలను కొనియాడుతూ నివాళులర్పించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ బ్రహ్మాండంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అందరూ పాల్గొన్నారని, పదవుల కోసం ఆశపడి ఎవరూ రాలేదన్నారు. సంపత్‌రెడ్డి కూడా ఉద్యమంలోకి అలాగే వచ్చారని చెప్పారు. ఉద్యమకారుడు సంపత్‌రెడ్డికి మంచి పదవి కట్టబెట్టాలని ప్రతిసారి కేసీఆర్ గుర్తు చేసేవారని, అందుకే ఆయనకు జడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా జోడు పదవులు అప్పగించారని గుర్తు చేశారు. సంపత్ మీద కేసీఆర్‌కు ఏనలేని ప్రేమ ఉంటుందన్నారు. సంపత్ కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది కలుగనివ్వమన్నారు. ప్రభుత్వం లేదని నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, ఎలాంటి బాధ వచ్చిన జిల్లా నుంచి గెలిచిన కడియం శ్రీహరి, తాను చూసుకుంటామని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇండ్లపై దా డులు చేస్తున్నారని, అనవసరంగా దూషిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ‘కేసీఆర్ నాయకత్వంలో మనం మళ్లీ గెలుస్తాం.. అందరం ఓపిక పడుదాం.. గులాబీ జెండాకు అండగా ఉందాం’ అని పిలుపునిచ్చారు.


పాగాల సంపత్‌రెడ్డి సంతాపసభకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

### సంపత్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం.. : కడియం



పార్టీ ఓటమి పాలయ్యిందనే బాధతో సంపత్‌రెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడం బాధగా ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పార్టీ ఓడిపోతుందని అనుకోలేదని, భయంగా ఉందని తనతో చెప్పాడని, త్వరలోనే మంచి రోజులు వస్తాయని తాను చెప్పానని గుర్తుచేశారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని అన్నారు. సంపత్‌రెడ్డి కుమార్తె చదువు బాధ్యత తీసుకుంటానని కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ క్యాడర్‌ను కొంత ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ ఒక్క నియోజకవర్గంలోనే కాదు.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంతో తనకు అనుబంధం ఉందని, వందకు వంద శాతం పార్టీ కార్యకర్తలు, వారి ఆస్తులను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. మంచి రోజులు వచ్చేదాకా ఓపిక పట్టాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### మలిదశ ఉద్యమనేత పాగాల : తాటికొండ



మలిదశ ఉద్యమ ముఖ్య భూమిక పోషించిన పాగాల సంపత్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను, అభివృద్ధి ఫలాలను జిల్లా ప్రజలకు అందించాడని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా గులాబీ పార్టీతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు.